'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే పరిమితం'


ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహిస్తున్న కొల్లూరి పవన్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏ మాత్రం అభివృద్ధి జరగదన్నారు. మంగళవారం ఆగాపురా నుంచి లక్డీకాపూల్‌లోని కలెక్టర్ కార్యాలయం వరకు కొల్లూరి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం హయాంలోనే అన్నివర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమైందన్నారు. బీసీలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు నిధులు మంజూరు చేస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకమని ఆయన అన్నారు. రాష్ట్ర నలుమూలలా అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనను వ్యతిరేకిస్తున్నారని బీజేపీ పాలన కావాలని ఎదురుచూస్తున్నట్లు పవన్ కుమార్ పేర్కొన్నారు.

ఆర్టీసీలో ప్రమాద రహిత వారోత్సవాలు


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

గోల్కొండ: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లే కాకుండా కార్యాలయ సిబ్బంది కలిసి కట్టుగా పని చేస్తేనే సంస్థ లాభాల బాటలోకి పయనిస్తుందని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. మంగళవారం మెహిదీపట్నంలోని టీజీఆర్టీసీ డిపోలో 35వ ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక సర్వీసు కలిగిన యాక్సిడెంట్స్ ఫ్రీ మెకానిక్స్, డ్రైవర్లను సన్మానించారు. ప్రత్యేక అతిథిగా టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు హాజరై మాట్లాడారు. డ్రైవర్లు తమ డ్యూటీ అవర్స్ కాగానే కచ్చితంగా రెస్ట్ తీసుకోవాలని, కనీసం 7–8 గంటలు అలసట పోయేలా నిద్రపోవాలని సూచించారు. ప్రమాదాలు నివారించడంలో మెకానిక్‌లు కూడా కీలక పాత్ర అని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నమ్రత, ఏఎంఈ రాజశేఖర్, కార్యాలయ సూపరిండెంటెంట్ కొండల రావు సిబ్బంది తదితరులున్నారు.


పాతబస్తీలోని నారాయణ స్కూల్‌లో..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

చార్మినార్: పాతబస్తీలోని నారాయణ స్కూల్‌లో పేరెంట్స్, చైల్డ్ ట్విన్నింగ్ డ్రెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో పేరెంట్స్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణ పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, కో ఆర్డినేటర్స్ నూర్ జహాన్, ఆజాద్, భవాని, ప్రిన్సిపాల్స్ శారద, తహినీయత్, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫలక్‌నుమా నారాయణ పాఠశాలలో..

ఫలక్‌నుమాలోని నారాయణ సీబీఎస్ఈ స్కూల్‌లో జరిగిన పేరెంట్స్, చైల్డ్ ట్విన్నింగ్ డ్రెస్ పోటీలలో తమ చిన్నారులతో పాటు పేరెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి పాల్గొని విజేతలను అభినందించారు. ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ నౌషీన్ ఫాతిమా పాల్గొన్నారు.


విజేతను అభినందిస్తున్న ఫలక్‌నుమా ప్రిన్సిపాల్ నౌషీన్ ఫాతిమా

బోనాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయం


మెమెంటో అందుకుంటున్న రాయికోటి బాబురాజా, ప్యారసాని వెంకటేష్

చార్మినార్: కోట్లా అలిజాలోని కోట మైసమ్మ ఆలయం అమ్మవారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. మాతేశ్వరి ఘటాల సామూహిక ఊరేగింపు సందర్భంగా చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ఆలయానికి చెందిన ప్రతినిధులు రాయికోటి బాబురాజా, ప్యారసాని వెంకటేష్ తదితరులు గాజుల అంజయ్య చేతుల మీదుగా మెమెంటో అందుకున్నారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలని వారు పేర్కొన్నారు.

'సినారె' పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో దాశరథి సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చెన్నారెడ్డికి సినారే ఆత్మీయ పురస్కారం, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరానికి దాశరథి సాహితీ పురస్కారం, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్‌వి.గంగాధర శాస్త్రికి సినారె జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు దాశరథి, సినారే సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా, శృతిలయ చైర్మన్ భీమ్‌రెడ్డి, శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు


వేడుకల్లో టీపీసీసీ ఓబీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: బోనాల ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని టీపీసీసీ ఓబీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు అత్యధికంగా నిధులు విడుదల చేసిందన్నారు. మంగళవారం పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..నగరంలో బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటే విధంగా కొనసాగుతాయన్నారు. పోల్కం ప్రకాష్ రావు, విక్రమ్, రాము యాదవ్, చందు, పోల్కం వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

వైభవంగా ఘటం ఊరేగింపు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఘటం సామూహిక ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఈ ఊరేగింపు ఆనందోత్సాహాల నడుమ ముగిసిందని సుల్తాన్ షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.


సామూహిక ఊరేగింపులో కాళీ మాత విగ్రహం


ఊరేగింపులో జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి, శశాంక్ తివారి

సమస్యల వలయంలో గ్రంథాలయం

- నాంపల్లి శాఖ గ్రంథాలయం వద్ద చికెన్ సెంటర్ ఏర్పాటు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని ఉన్నతాధికారులు


సిటీ గ్రంథాలయం నాంపల్లి శాఖ

నాంపల్లి: సిటీ గ్రంథాలయ సంస్థ హైదరాబాద్ నిర్వహణలో నాంపల్లి శాఖ (బజార్‌ఘాట్)లో కొనసాగుతున్న గ్రంథాలయం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు పాఠకులతో కిక్కిరిసిపోయి కనిపించిన ఈ గ్రంథాలయం పాఠకులు లేక వెలవెలబోతోంది. ఈ గ్రంథాలయంలో పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడ నెలకొన్న పరిస్థితులతో ఎవరూ రావడానికి ఇష్టపడటం లేదు. ఇక్కడికి రెగ్యులర్‌గా వచ్చే పాఠకులే ఇతరత్రా గ్రంథాలయాలకు వెలుతున్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు ఇక్కడి గ్రంథాలయమంటే భయపడుతున్నారు.

వాహనాల అక్రమ పార్కింగ్..

పాఠకుల సంఖ్య లేని కారణంగా కొందరు ప్రైవేట్ వ్యక్తులు గ్రంథలయం ముందు వైపు చికెన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మరికొందరు ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లకు చెందిన వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. ఇక లోనికి రావడానికి పోవడానికి మనిషికి సరిపోయే స్థలంలో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు.


గ్రంథాలయం వద్ద చికెన్ సెంటర్ నిర్వహణ

మురుగుమయంగా..

ఎంఎన్‌జె కేన్సర్ ఆసుపత్రి వైపు నుంచి మురుగునీరు గ్రంథాలయం ముందు ప్రవహిస్తోంది. గ్రంథాలయంలోనికి వెళ్లాలంటే ఈ మురికి నీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంది. గ్రంథాలయం చుట్టూ అపరిశుభ్రత, చెత్తకుప్పలు పేరుకునిపోవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇవే దోమలు గ్రంథాలయంలోనికి వచ్చే పాఠకులను కుట్టేస్తున్నాయి. ఫలితంగా ఈ గ్రంథాలయం పేరు చెబితేనే ఎవరూ రావడానికి ఇష్టపడటం లేదు.


గ్రంథాలయం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్

సమయ పాలన పాటించని సిబ్బంది..

ఇక్కడ పనిచేసే సిబ్బంది వేళాపాళా పాటించడం లేదు. సెలవు రోజుల్లో కాకుండా ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు గ్రంథాలయాన్ని తెరవాల్సి ఉంది. కానీ ఇక్కడి అధికారులు సిబ్బంది ఉదయం 10 గంటల వరకు తెరవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాబట్టి జిల్లా ఉన్నతాధికారులైన స్పందించి గాడి తప్పిన గ్రంథాలయాన్ని సరైన మార్గంలో నడిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చికెన్ సెంటర్లను, అక్రమంగా వెలసిన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని, గ్రంథాలయం ముందు మురుగు నీటి ప్రవాహం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాతబస్తీలో పార్టీ పటిష్టతకు దిశా నిర్దేశం చేయాలి


కొండా విశ్వేశ్వర రెడ్డిని కలిసిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: 18వ లోక్‌సభలో బీజేపీ తరఫున విప్‌గా నియమితులైన ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డిని కలిసి రాష్ట్రంలో పార్టీ పటిష్టం కోసం చేపట్టాల్సిన పలు పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. పాతబస్తీ దారుషిఫాలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ విప్‌గా నియమితులైన కొండా విశ్వేరరెడ్డిని కలిసి పాతబస్తీని సందర్శించి పార్టీ పటిష్టంకు మరింత కృషి చేసే విధంగా దశ దిశా నిర్దేశం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

1.3 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు

అబిడ్స్: ఆపరేషన్ ధూల్‌పేటలో భాగంగా ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు ముమ్మర దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్‌తో పాటు సిబ్బంది భాస్కర్ గౌడ్, సునీల్, అజీమ్, ప్రకాష్, మహేష్, రాకేష్, భాస్కర్‌రెడ్డి బృందం ధూల్‌పేట బల్‌రామ్‌గల్లీలో దాడులు నిర్వహించారు. గంజాయిని విక్రయిస్తున్న రవీందర్ సింగ్, చిన్నా, మనీష్ సింగ్‌ను అరెస్టు చేసి వారి వద్ద 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్ల ఆందోళనలతో వాహనాల దారి మళ్లింపు

సుల్తాన్‌బజార్: ఆశా వర్కర్ల సమస్యలపై కోఠి సుల్తాన్‌బజార్ చౌరస్తాలో వేలాది మంది ఆశా వర్కర్లు బైఠాయించి ఆందోళనలు చేయడంతో కోఠిలో మంగళవారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, సంతోష్‌నగర్, నల్గొండ క్రాస్‌రోడ్డు నుంచి కోఠికి వచ్చే ఆర్టీసీ బస్సులకు, వాహనదారులకు ట్రాఫిక్‌జామ్ కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోఠికి వెళ్లే బస్సులను ఇటు చాదర్‌ఘాట్ చౌరస్తా నుంచి ఎంజీబీఎస్‌కు దారి మళ్లించగా సికింద్రాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను చాదర్‌ఘాట్ నుంచి కాచిగూడ వైపు పోలీసులు దారిమళ్లించారు. అదేవిధంగా ప్రైవేటు వాహనాలను సైతం ఇదే విధంగా దారిమళ్లించారు. నాంపల్లి అబిడ్స్ నుంచే వచ్చే వాహనాలను సైతం పోలీసులు మొజంజాహీ మార్కెట్ అఫ్జల్‌గంజ్ మీదుగా దారి మళ్లించారు.

ప్రత్యేక ఆకర్షణగా 'శివశక్తి గణాధి'



చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో రెండు రోజుల పాటు కొనసాగిన బోనాల ఉత్సవాల్లో శివశక్తి గణాధిలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. నెల రోజుల పాటు నియమ నిష్టలతో ఉంటూ అమ్మవారిని ఆవహించి డప్పు చప్పుళ్లతో వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఛత్రినాక ప్రాంతానికి చెందిన శివశక్తి గణాధి బి.సరస్వతి తలపై బోనం పెట్టుకొని నేలపై కూర్చొని నృత్యం చేసుకుంటూ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయానికి చేరుకోవడం భక్తులను ఎంతో ఆకట్టుకుంది.

బీఆర్. ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటు


శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దూద్‌బౌలి: పాతబస్తీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీఆర్ ఆంజనేయులు సోమవారం అనారోగ్యంతో మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి, పాత నగర వాసులకు తీరని లోటని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ సంతాపం తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిపాటి రాహుల్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్, వెంకటేష్, కృష్ణ కుమార్, అశోక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన బీఆర్ ఆంజనేయులు పార్థివదేహానికి పార్టీ పతాకాన్ని కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన యువజన కాంగ్రెస్‌లో, నగర కాంగ్రెస్‌లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా సేవలను అందించారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాన్ని బాధ్యతగా చూడాలి


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రభుత్వ ఉద్యోగాన్ని బాధ్యతగా చూడాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి గ్రేడ్-1 ఫార్మసీస్టు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. డాక్టర్ మహ్మద్ మజహరుల్లా మాట్లాడుతూ.. పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణ అనేవి ప్రభుత్వ ఉద్యోగ పర్వంలో సోపానాలని అన్నారు. శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరి మనన్నలు పొందారన్నారు. ఆర్ఎంవో డాక్టర్ వినాయక్‌రావు, ఏవో శ్రీనివాసరావు, సివిల్ సర్జన్ డాక్టర్ గోపాల్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎన్‌హెచ్‌ఎం నేతలు

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్యమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు వారు మహా ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం నాయకులు పద్మ, జ్యోతి, శ్రావణ్, అనిత, తిరుమలేష్, సంతోష్, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ టోర్నమెంట్

గన్‌ఫౌండ్రీ: ప్రగతి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రుద్రరాజు నర్సింహామూర్తి రాజు మెమోరియల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ..చెస్ క్రీడ వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం బాలికల, బాలుర విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో శ్రీనివాసరాజు

ముందుస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల వైఫల్యం!

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు, రాస్తా రోకోలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో సుల్తాన్‌బజార్ పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోఠి డీఎంహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు పర్మనెంట్ ఉద్యోగులు సైతం తరచూ తమ సమస్యలపై ధర్నాకు దిగుతున్నారు. అయితే ముందస్తు సమాచారం ఉన్న పోలీసులు సరైన పద్ధతిలో స్పందించకపోవడంతో ఇటీవల కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల రోడ్డును దిగ్బంధం చేయడంతో దాదాపు 3 గంటల పాటు కోఠి చౌరస్తా పరిసర ప్రాంతాల రోడ్లు ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా మంగళవారం సైతం ఆశ వర్కర్లు ఉమెన్స్ కళాశాల చౌరస్తాలో బైఠాయించి వేలాది మంది ఆందోళన చేశారు. ఈ సమాచారం పోలీసులకు ఒక్కరోజు ముందే ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చేరవేసిన సంబంధిత సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ అధికారి సరైన రీతిలో స్పందించకపోవడం, తగినంత సిబ్బందిని బందోబస్తుకు పిలుపుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇప్పటికైనా భారీ ధర్నాలు జరిగితే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన బందోబస్తును, ముందు జాగ్రత్త చర్యలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఫలహారపు బండి ఊరేగింపు


ఫలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఫలహారపు బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పర్వతాల రాజేందర్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు జంగమ్మెట్, ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ రోడ్డుల మీదుగా కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని ఫలహారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సదా మణిశంకర్, సాయి ఉదయ్ పాల్గొన్నారు.

పండుగలతో ఆధ్యాత్మిక వాతావరణం


ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: పండుగలు సమాజంలో ఆధ్యాత్మిక వాతారణాన్ని పెంపొందిస్తాయని పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆదర్శ్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రేమ్‌కుమార్‌ను కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎ.నర్సింగ్‌రావు, యాదగిరి, వెంకటేశ్వర్‌రావు, కె.రవి, ఎం.ప్రవీణ్‌కుమార్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: నాట్య తరంగిని కూచిపూడి శిక్షణాలయం ఆధ్వర్యంలో నాట్య గురువులు పద్మ భూషణ్ రాజా రాధారెడ్డి, కౌసల్యారెడ్డి, యామిని రెడ్డి శిష్యురాలు గెంటెల మీనాక్షి కూచిపూడి నాట్య రంగ ప్రవేశం మంగళవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. అంబస్తుతి, దశావతారం, ఉషాపరిణయం, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జేకేసీ ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ అమ్మవార్ల హుండీ ఆదాయం లెక్కింపు



గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఈ సంవత్సరం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. అమ్మవారి 5, 6, 7 బోనం పూజల ఆదాయాన్ని మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు పూజలకు కలుపుకోని రూ.3,22,236 ఆదాయం వచ్చిందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఏడు పూజల్లో అమ్మవారికి రూ.1004841 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ లెక్కింపులో అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నర్సింగ్‌రావు, వినోద్, ఎల్లేష్ తదితరులున్నారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదరణ


శ్రీలత, రీజినల్ మేనేజర్

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రంగారెడ్డి రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 2 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని రంగారెడ్డి రిజినల్ మేనేజర్ శ్రీలత అన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ బస్టాండ్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..గత సంవత్సరంలో రంగారెడ్డి రీజియన్ పరిధిలో సుమారు 280 కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని, పెరుగుతున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని మరో 60 కొత్త ఎక్స్‌ప్రెస్, 40 పల్లె వెలుగు బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కువ సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్న నేపథ్యంలో ఎంజీబీఎస్‌లో 10, హైదరాబాద్ డిపో-2లో 16 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఎంజీబీఎస్‌లో పావురాల బెడద ఎక్కువ ఉందని వాటిని నివారించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

'బెదిరింపు కాల్స్ వస్తున్నాయి'


బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మహారాజ్‌గంజ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఈ నెల 28న వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించారని, ఈ విషయమై అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

గృహిణి అదృశ్యం


కొడావత్ చిట్టి

గౌలిపురా: లేబర్ పని కోసం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుల్తాన్‌షాహీ రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంతానికి చెందిన కొడావత్ చిట్టి (31), కె.మల్లేష్ దంపతులు. ఈనెల 26న ఉదయం 6 గంటలకు కొడావత్ చిట్టి లేబర్ పని నిమిత్తం తోటి కార్మికురాలు శాంతితో కలిసి ఉప్పుగూడ రైల్వేస్టేషన్ నుంచి బోరబండ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అనంతరం పని నుంచి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కాగా తోటి కార్మికురాలు శాంతితో ఆరా తీయగా పని ప్రదేశంలో తాపీ మెస్త్రీ శంకర్‌తో గొడవ పడి అక్కడి నుంచి వెళ్లినట్లు తెలిపింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684